క్లుప్తంగా

ఘనంగా గోదాదేవి కల్యాణం



అలంకరణలో వేణుగోపాలస్వామి మూలవిరాట్

పర్చూరు (చినగంజాం): స్థానిక వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఘనంగా గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస సందర్భంగా దేవాలయంలో గత నెల 16వ తేదీ నుంచి గురువారం వరకు 18 రోజులపాటు నిత్యం సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు గీతాపారాయణం, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. గురువారం ముగింపు సందర్భంగా గోదాదేవి కల్యాణాన్ని అర్చకులు సత్యనారాయణ నిర్వహించారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి దామానాగేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ రావువారి వెంకట శివప్రసాద్ పర్యవేక్షించారు.

ముప్పాళ్లలో నేత్రదానం



చిన్నం నాగేశ్వరరావు (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని ముప్పాళ్ల గ్రామానికి చెందిన చిన్నం నాగేశ్వరరావు (80) గురువారం మృతి చెందడంతో ఆయన నేత్రాలను బంధువులు దానం చేశారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలు సేకరించారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్కే రఫీ, చుండి సాంబశివరావులు దాత నాగేశ్వరరావు భార్య ఇంద్రమ్మ, తమ్ముడు కోటేశ్వరరావు, భార్య రాగమ్మ,కుమారుడు విజయశంకర్ వారి బంధుమిత్రులకు అభినందనలు తెలియజేశారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

పర్చూరు (చినగంజాం): స్థానిక నేతాజీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దేవరపల్లి గ్రామానికి చెందిన మార్నేని రిషిత జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం పండ్లు, అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్, క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, కారుమూరి సుబ్బారెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రం, గడ్డిపాటి శ్రీనివాసరావు, నాగబడి సుబ్బారావు, రావి సత్యనారాయణ, కాల్వ సత్యనారాయణ, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): రోడ్డు దాటుతున్న బాలుడిని కారు ఢీకొట్టటంతో బాలుడికి గాయాలయ్యాయి. ఈఘటన గురువారం సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన కె. బాలు గురువారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతున్న బాలుడిని కారు ఢీకొట్టడంతో బాలుడికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బైకు అదుపుతప్పి యువకుడికి గాయాలు



క్షతగాత్రుడు పఠాన్ నాయక్

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పి ఓ యువకుడికి గాయాలైన ఘటన అద్దంకి మండలంలోని నామ్ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. పుల్లలచెరువుకు చెందిన పఠాన్ నాయక్ బైకు మీద ఒంగోలు నుంచి పుల్లలచెరువుకు వెళ్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై గోపాలపురం గ్రామం స్పీడ్ బ్రేకర్ వద్దకు వచ్చేసరికి బైకు అదుపుతప్పింది. దీంతో నాయక్ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 వాహనం క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించింది.

పర్యావరణ పరిరక్షణలో సర్పంచ్

- గ్రామం చుట్టూ మొక్కల పెంపకం
- సొంత ఖర్చుతో మొక్కలు సమకూర్చిన సర్పంచ్
- నాలుగేళ్లుగా గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచ్
- స్ఫూర్తినిస్తున్న వెంకట సుబ్బయ్య



ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న కూలీలు



వేమవరం నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి గ్రామంలోకి మొక్కలు నాటుతున్న సిబ్బంది

బల్లికురవ: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు అనే నినాదాన్ని మనమందం వింటూనే ఉంటాం. ఎవరో ఒకరు.. ఎప్పుడో అప్పుడు వచ్చి చేస్తారని చూడలేదు ఆ సర్పంచ్. తన వంతు బాధ్యతగా నేనేం చేయగలను అని ఆలోచించి ముందుకు కదిలాడు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్ పాత్ర అత్యంత ముఖ్యమైనది. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ కీలకపాత్ర వహిస్తాడు. గ్రామాన్ని ఎలాగైనా సరే అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నాడు మండంలోని వేమవరం సర్పంచ్ ధూళిపాళ్ల వెంకట సుబ్బయ్య. గ్రామం చుట్టూ గ్రానైట్ పరిశ్రమలు ఉండటంతో రోజు కాలుష్యం పెరుగుతోంది. స్వచ్ఛమైన గాలి అందక ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారు. ఆరోగ్యవంతమైన సమాజస్థాపనకు ప్రజలను కాపాడేందుకు సర్పంచ్ సుమారు రూ.1 లక్ష సొంత నిధులతో వారం రోజులుగా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకం కూలీలతో చేపట్టారు. గ్రామం చుట్టూ సుమారు 150 వరకు గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. గ్రానైట్ వ్యాపారాలతో గత ఐదేళ్లుగా గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. సర్పంచ్ తన గ్రామంలో మొక్కలు నాటాలని సంకల్పించారు. తన ఆశయానికి గ్రామస్తులు కూడా సహకారం అందించడంతో కడియం ప్రాంతం నుంచి కొబ్బరి, మారేడు, నేరేడు, పనస, జామ, ఇలా 770 వివిధ రకాల మొక్కలు తెప్పించారు. ఉపాధి హామీ కూలీలచే ఫీల్డ్‌అసిస్టెంట్ వడిత వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి గ్రామం వరకు, సచివాలయం, రైతు సేవా కేంద్రం, గ్రామం నుంచి పింగాణి పరిశ్రమ వరకు, ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటించారు. సర్పంచ్ ఆశయానికి గ్రామస్తులు సహకారం అందించారు.

మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన గాలి..




గ్రామ ప్రజలు కాలుష్యం బారిన పడకుండా కాపాడటంతో పాటు స్వచ్ఛమైన గాలి అందించేందుకు మొక్కల పెంపకాన్ని చేపట్టాం. మొక్కల పెంపకాన్ని గ్రామస్తులంతా బాధ్యతగా తీసుకున్నారు. వాటి వల్ల వచ్చే ఫలసాయం కూడా గ్రామస్తులకే. ప్రతిరోజూ వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు పెట్టడం, రక్షణకు ట్రీగార్డులతో పటిష్ట చర్యలు తీసుకున్నాం.

– ధూళిపాళ్ల వెంకటసుబ్బయ్య, సర్పంచ్

తప్పుల తడకగా కులగణన

జే.పంగులూరు: కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్సీ కులగణనలో అనేక తప్పులు ఉన్నాయని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కులానికి ముందు జాతీయ హిందు అని ఉండాల్సి ఉండగా దానికి బదులుగా క్రిస్టియన్ అని వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో గల దళిత కాలనీలో సుమారు 700 మంది ఉండగా అందులో 45 మంది పేర్లు వరుసగా క్రిస్టియన్ అని జాబితాలో నమోదైంది. వీరిలో కొంత మంది ఉద్యోగులుగా ఉండగా, ఎక్కువ మంది చదువుకొనే వారే ఉన్నారు. హిందుకు బదులు తమ పేరు క్రిస్టియన్‌గా ఉండటం వలన వారి భవిష్యత్‌కు ఇబ్బందిగా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. రామకూరు దళిత వాడలో క్రిస్టియన్ అని ఎక్కువగా ఉన్నాయి. వాటిని సరిచేసేందుకు ఇప్పటికే గ్రీవెన్స్‌లో పెట్టామని అధికారులు తెలిపారు.



తూర్పు తక్కెళ్లపాడులో దళిత కాలనీలో క్రిస్టియన్‌గా నమోదైన కులగణన జాబితా



కారంచేడు కాలువ సెంటర్లో ఉదయం 9గంటల సమయంలో పొగమంచు



కారంచేడు మధ్య బస్టాండ్ సమీపంలో దట్టంగా పొగమంచు

తెలవారనీయని.. మంచుతెరలు

చినగంజాం/కారంచేడు: మంచు తెరల తాకిడికి సూరీడు చిన్నబోయాడు. ఉదయం 10 గంటలైనా నా వెలుగులు పడనివ్వరా అంటూ అలిగి వెళ్లిపోయాడు. శీతాకాలంలో కురుస్తున్న మంచును ప్రజలు ఆస్వాదిస్తున్నారు. పొగ మంచు ధాటికి చినగంజాంలో బస్సు మార్గం, రైల్వే లైను, రద్దీ వీధుల్లో దట్టంగా అలముకోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సుమారు ఉదయం 10 గంటల వరకు మంచు అదే విధంగా కొనసాగడంతో ప్రజలు ఎదురొచ్చే వాహనాలు, రైల్వేలైనుపై రైళ్లు కనిపించక అసౌకర్యానికి గురయ్యారు.

కారంచేడుతో పాటు కుంకలమర్రు, స్వర్ణ, ఆదిపూడి, యర్రంవారిపాలెం, తిమిడెదపాడు, దగ్గుబాడు ప్రాంతాల్లో పొగ మంచు దుప్పటి కప్పేసింది. పొగ మంచు కారణంగా శనగ రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పొగమంచుతో శనగ చేలు చాలా ఏపుగా పెరుగుతాయని, పంటలో పులుసు చక్కగా వృద్ధి చెందుతుందని, దీంతో దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావంగా ఉన్నారు.



చినగంజాం రోడ్లపై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రైల్వే లైను మీద దట్టంగా కమ్ముకున్న పొగమంచు

వైజ్ఞానిక ప్రదర్శనతో ఉపయోగాలు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



పంగులూరులో ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈఓ

చీరాల అర్బన్: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2025లో భాగంగా మండల స్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం చీరాలలోని కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రదర్శనను చీరాల ఎంఈఓ–2 పి.సుధారాణి ప్రారంభించారు. మండలంలోని ఎనిమిది పాఠశాలల విద్యార్థులు పాల్గొని వారి ప్రాజెక్టులను ప్రదర్శించారు. న్యాయనిర్ణేతలుగా గీతా యంగ్ సైంటిస్ట్ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ వ్యవహరించారు. జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, యన్నం యలమందేశ్వరరావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

పంగులూరులో..

జే.పంగులూరు: మండల పరిధిలోని స్థానిక కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయిలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ నాగభూషణం, వీరాంజినేయులు ప్రారంభించారు. ఈ ప్రదర్శినలో మండలంలోని 30 మంది విద్యార్థులు వారి ప్రదర్శనలు చూపించారు.

సంఘసంస్కర్తల జీవితాలు ఆదర్శం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అద్దంకి: సంఘసంస్కర్తల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేశ్‌బాబు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శింగరకొండలోని గురుకుల పాఠశాలలో గురువారం సావిత్రిబాయిపూలే జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, ఇంగ్లిషు మీడియం విద్యార్థులకు వేర్వేరురుగా పోటీలు నిర్వహించారు. మొదటి రెండో బహుమతులుగా వరుసగా రూ.1500, రూ.1000, మూడో బహుమతిగా రూ.500 మెమెంటోలు, ప్రశంస పత్రాలను నేడు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్‌రావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగానే పోలీసు ఉద్యోగం



అభ్యర్థులకు సూచనలందిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

చీరాల టౌన్: పోలీసు ఉద్యోగాలు ప్రతిభ ఆదారంగానే వస్తాయి.. అక్రమ మార్గాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని ఈపురుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఈపురుపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎస్సై పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభంగా పోలీసు ఉద్యోగం రాదు, కష్టపడి ప్రతిభ ఉంటేనే ఉద్యోగం సాధిస్తామన్నారు. అభ్యర్థులకు శారీరక దృఢత్వం పెంచుకునేలా పలు సలహాలు అందించారు. ఫిజికల్ ఫిట్‌నెస్‌లో ప్రతిభ చూపితే ఉద్యోగాలు వస్తాయని కొందరు యువతను పక్కదోవ పట్టేలా డబ్బులు వసూళ్లు చేసి అక్రమాలకు పాల్పడతారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంట సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ నాగిరెడ్డి

వేటపాలెం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉంటుందని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ పీ నాగిరెడ్డి సూచించారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, పాఠశాల హెచ్ఎంలతో గురువారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోవాలో సూచించారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు నిర్వహించాల్సిన బాధ్యతలు, పాఠశాలల అభివృద్ధి వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీసీఎస్ సీఎంఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓలు జేవీ సుబ్బయ్య, ఐ పురుషోత్తం, ఆర్‌పీఎస్‌కే సుబ్బారావు, పీ శ్రీనివాసరావు, టీ బంగారునాయుడు, ఎస్ఎంసీ చైర్మన్, ప్రదానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిరక్షణ మనందరి బాధ్యత..

పర్చూరు(చినగంజాం)/యద్దనపూడి/కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ బాధ్యత విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులందరిపైన ఉందని ఎంఈఓ 2 వెంకటరామయ్య అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో హెచ్ఎంలు, పాఠశాల యాజమాన్య కమిటీల ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

✦ కారంచేడు మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంప్లెక్స్‌ల చైర్మన్‌లు, యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ సుబ్బారావు, ఉమామహేశ్వరరావు, పిచ్చయ్య, కేఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

✦ యద్దనపూడిలో ఎంఈఓ సీహెచ్ గోపి ఆధ్వర్యంలో హెచ్ఎంలకు, ఎస్ఎమ్‌సీ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతికి పాఠశాల యాజమాన్య కమిటీలు కీలకపాత్ర వహించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ నాగిరెడ్డి, శ్రీనివాసరావు, షఫిబాషా, సీఆర్పీలు ప్రేమ్‌కుమార్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అద్దంకి/జే.పంగులూరు: స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని ఎంఈవోలు నాగభూషణం, వీరాంజినేయులు అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అన్ని పాఠశాలల హెచ్ఎంలకు, యాజమన్య కమిటీ చైర్మన్‌లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ శ్రీధర్, శేషగిరి, రత్తయ్య పాల్గొన్నారు.

✦ అద్దంకి ఎమ్మార్సీలో ఉపాధ్యాయులు, హెచ్ఎంలకు పాఠశాల కమిటీ చైర్మన్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు మండల సమావేశం

బల్లికురవ: బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమ కుమారి గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశంలో శాఖ వారీగా సమీక్షిస్తామన్నారు. సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

చీరాల టౌన్: చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను విధిగా రికార్డుల్లో నమోదు చేయడంతో పాటుగా టీకాలను సక్రమంగా అందించాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. గురువారం ఈపూరుపాలెం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ.. ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్య స్థితిగతులు, శిశు మరణాల తగ్గింపుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, 0–5 ఏళ్లలోపు చిన్నారులకు టీకాలు క్రమంతప్పకుండా అందించాలని సూచించారు. సమావేశంలో పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో వ్యాధినిరోధక శక్తి

చీరాల టౌన్: నులిపురుగుల నివారణ టీకాలతో దూడలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఈపురుపాలెం పశువైద్యురాలు పావని సూచించారు. గురువారం మండలంలోని ఈపురుపాలెం పశువైద్యశాలలో గాలికుంటు, వ్యాదినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాడిపరిశ్రమ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఆదాయ వనరని, జీవాల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవడం వలన పశువులు ఆరోగ్యం, పశుపోషకులు ఆర్థికంగా వృద్ధి చెందుతారన్నారు. నులిపురుగుల టీకాలను పశుపోషకులు విధిగా తమ పశువులు, దూడలకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశుపోషకులు, రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ అందించిన దాతలు

పర్చూరు(చినగంజాం): ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు చీరాలకు చెందిన మోడరన్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మునీరుల్లాఖాన్ ఆర్థిక సహకారంతో స్టడీ మెటీరియల్ అందజేసినట్లు విద్యాశాఖాధికారి–1 ఎంపీ సత్యనారాయణ తెలిపారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 వెంకటరామయ్య, పాఠశాల హెచ్ఎం జీ వసుంధరాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్ఐ

బల్లికురవ: గ్రామాల్లోని భూసమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సదస్సులు ఏర్పాటు చేసిందని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు కోరారు. గురువారం ముక్తేశ్వరం గ్రామంలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. రైతులు వ్యవసాయ పనుల్లో ఉండటం వల్ల అరకొరగానే హాజరయ్యారు. పాస్‌పుస్తకాలు కోసం 1, సర్వే కొలతలకు 2 అర్జీలు అందజేశారు. డిప్యూటి తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ పోతురాజు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank
ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1వంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

ఋణగ్రహీత(లు): (1). శ్రీ నలదల వెంకటేశ్వర్లు, తండ్రి: వెంకట సుబ్బయ్య, [illegible] ... (2). శ్రీమతి వల్లపోతు శిరీష, భర్త: వల్లపోతు ప్రసాద్, డి.నెం.1-656, పొన్నలూరు గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా-523109.
హామీదారు: శ్రీ వల్లపోతు ప్రసాద్, తండ్రి: వెంకటేశ్వర్లు, డి.నెం.1-656, పొన్నలూరు గ్రామం & మండలం, ప్రకాశం జిల్లా-523109.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, కనుమల్ల [illegible] ఇంజనీరింగ్ కాలేజ్ బ్రాంచ్ (13699) నుండి శ్రీ నలదల వెంకటేశ్వర్లు, తండ్రి: వెంకట సుబ్బయ్య మరియు శ్రీమతి వల్లపోతు శిరీష, భర్త: వల్లపోతు ప్రసాద్ పొందిన లోన్ ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ప్రస్తుత తేదీ నాటికి బకాయి మొత్తం వడ్డీతో	వడ్డీ రేటు
కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫామ్ హౌస్ అకౌంట్ నెం. 3699828000096.	10.01.2017 తేదీన రూ.9,20,000/-	రూ.6,24,830/- 10.12.2024 తేదీ నాటికి	10.75%

[illegible] 28.02.2024 తేదీన నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. [illegible] రూ.6,24,830/- [illegible] సెక్షన్ 13(2) [illegible] సెక్షన్ 13(4) [illegible] SARFAESI చట్టం [illegible] సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) [illegible]

తనఖా / కాయిస్తు ఉంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి
ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, [illegible] సర్వే నెం.769/2 లోని ఎ. 0.05 సెంట్లు విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ గ్రౌండ్ ఫ్లోర్ బిల్డింగ్ యావత్తు. హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: [illegible] భూమి, పడమర: రోడ్డు, ఉత్తరం: [illegible] భూములు.

తేది: 21.12.2024, ప్రదేశం: ఒంగోలు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com